

శ్రీవారి పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో అనంత పద్మనాభవ్రతం సందర్భంగా శనివారం ఉదయం శ్రీవారి పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. అనంత పద్మనాభ వ్రతాన్ని ప్రతి ఏటా తిరుమలలో భాద్రపద శుక్ల చతుర్దశి నాడు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఉదయం పూజలు చేసిన తరువాత శ్రీ సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుండి ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీ వరాహస్వామి ఆలయం చెంత ఉన్న స్వామి పుష్కరిణిలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.



మిస్సింగ్ కేసు...
వీడిన మిస్టరీ

10 గంటల్లోనే ఛేదించిన పోలీసులు

తల్లి బహిర్భూమికి వెళుతుండగా..

మురికి కుంటలో పడి మృతి





చిన్నారి రమ్య మృతదేహం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలో కనబడకుండా పోయిన ఆరు నెలల చిన్నారి కేసును పోలీసులు కేవలం 10 గంటల్లోనే చేదించారు. పసిబిడ్డ కేసులో పెద్ద ట్విస్ట్ చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు ... తిరుపతి కొరమేను గుంటలో నివసిస్తున్న భూపతికి ఆరు నెలల రమ్య అనే కుమార్తె గలదు. తండ్రితో పాటు నిద్రిస్తున్న చిన్నారి ఉదయం 5గంటల నుంచి కనపడటం లేదని భూపతి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు చిన్నారిని కనిపెట్టేందుకు గాలింపులు చేపట్టారు. మధ్యాహ్నం 11 గంటలైనా ఆచూకీ తెలియక పోవడం, చిన్నారి మిస్సింగ్ కేస్ మాధ్యమాల ద్వారా విస్తతంగా ప్రచారం కావడంతో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు నేరుగా చిన్నారి ఇంటికి చేరుకుని అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఐదు ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి తిరుపతి పరిసరాలలో గాలింపులు చేపట్టారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెట్టారు. తిరుపతి బస్టాండు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతంలోని సీసీ ఫుటేజ్ లను పరిశీలించారు. అయినా పాప ఆచూకీ కనపడలేదు. దీంతో కుటుంబ సభ్యులపై అనుమానం వచ్చిన పోలీసులు గట్టిగా ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. చిన్నారి రమ్య తల్లి ఉదయం ఐదు గంటల ప్రాంతంలో ఆరు నెలల పాపను చంకన వేసుకొని బహిర్భిమికి వెళ్లింది. తొందర్లో మురికి కాలువ దాటుతుండగా చంకలోని పసిబిడ్డ ప్రమాదవశాత్తు కాలంలో పడింది. ఎంత ప్రయత్నించినా పాపని బయటికి తీయలేకపోయింది. చిన్నారి కొంతసేపటికి మురికిగుంటలో మునిగిపోయింది. ఈ విషయం తెలిస్తే ఇంటిలో వారు తనని తిడతారనే భయంతో, పాప కనిపించడం లేదని చెప్పింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించిన విషయం విదితమే. ఎట్టకేలకు పాప తల్లి అసలు విషయం పోలీసులకు చెప్పడంతో మురికి కాలువను జల్లెడ పట్టారు. అందులో చిన్నారి రమ్య మృతదేహం బయటపడింది. పోలీసులు కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తిరుపతి నగరంలో ఇంకా బహిర్భూమికి వెళ్లే పరిస్థితులు ఉండటం, ఈ సందర్భంగా చిన్నారి మృతి చెందడం బాధాకరమైన అంశం.



నేడు చంద్రగ్రహణం

ఆర్జితసేవలు, బ్రేక్ దర్శనాలు రద్దు

శ్రీవారి ఆలయం మూసివేత

ప్రజాశక్తి - తిరుమల చంద్రగ్రహణం కారణంగా శ్రీవారి ఆలయాన్ని ఆదివారం తాత్కాలికంగా 12 గంటల పాటు టిటిడి మూసివేయనుంది. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సోమవారం తెల్లవారుజామున మూడు గంటల వరకూ దర్శనాలను నిలిపివేయనున్నారు. ఇప్పటికే శ్రీవారి దర్శనం కోసం భక్తులతో కంపార్టుమెంట్లు, షెడ్లు నిండి ఉన్నాయి. దీంతో భక్తుల సర్వదర్శనానికి అనుమతిని టిటిడి నిలిపివేసింది. భక్తులు పిఏసి 1, 2, 3 హాల్స్‌లో వేచి ఉండి, సోమవారం ఉదయం ఆరు గంటలకు క్యూలైన్లలోకి ప్రవేశించాలని టిటిడి కోరుతోంది. ఆదివారం రాత్రి 9.50 నుంచి సోమవారం వేకువజామున 1.31 గంటల వరకూ చంద్రగ్రహణం ఉండనుంది. గ్రహణ విడిచాక శుద్ధి, పుణ్యాహవచనం చేసి, నిత్యసేవలను ఏకాంతంగా నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి టిటిడి అనుమతించనుంది. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఆర్జితసేవలు, సోమవారం విఐపి బ్రేక్ దర్శనాలను టిటిడి రద్దు చేసింది. ఆదివారం చంద్రగ్రహణం కారణంగా తిరుమలలో ప్రతినెల నిర్వహించే పౌర్ణమి గరుడసేవను టిటిడి రద్దు చేసింది. అదేవిధంగా ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను రద్దు చేసింది.

ట్రంపు సుంకాల భారంపై...
మోడీ మౌనమేల..!

జిల్లావ్యాప్తంగా వామపక్షాల నిరసన హోరు



తిరుపతిలో..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షులు ప్రకటించడంతో దేశీయ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందని, ఈ విషయమై ప్రధాని మోడీ మౌనం వీడాలంటూ జిల్లావ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు.

తిరుపతి హెడ్ పోస్టాఫీసు వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటరత్నం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ఎన్నికల్లో గెలిచిన తరువాత అమెరికా కాంగ్రెస్ సమావేశాలలో సుంకాల విధింపు గురించి హెచ్చరిక చేశారని, ఇండియాను సుంకాల సామ్రాట్ అని పేరు పెట్టారని, దెబ్బకు దెబ్బ సూత్రంగా సుంకాలు విధిస్తామని బెదిరింపులు జారీ చేసినా ప్రధాని మోడీ మౌనంగా ఉండటం భారతీయులను అవమానించినట్లేనన్నారు. చిన్న దేశాలైన మెక్సికో, కొలంబియా దేశాలు తమ పౌరులను అవమానకరంగా పంపించడం పట్ల గట్టి నిరసన ప్రకటించారని గుర్తు చేశారు. అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ సర్కారు లొంగుబాటును ఎండగడుతూ భారీ సంఖ్యలో ప్రజలను సమీకరించి పెద్దఎత్తున పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, జయచంద్ర, మాధవ్, బుజ్జి, నరేంద్ర, రాజు, జయంతి, రఘు, బాలాజీ, బాదుల్లా, చిన్నం పెంచలయ్య, జె.విశ్వనాథం, కె.రాధాక్రిష్ణ, లోకేష్ పాల్గొన్నారు.

– **గూడూరు** టవర్‌క్లాక్ సెంటర్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఎం నాయకులు ఎంబేటి చంద్రయ్య, సిపిఐ కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ మాట్లాడుతూ దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుండి అవుతున్నాయని, ఏటా సుమారు 2 వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయన్నారు. రొయ్యల ధరలు ఘోరంగా పడిపోవడంతో సముద్ర తీర ప్రాంతాల్లోని రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారన్నారు. అలాగే గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో అనకాపల్లి, శ్రీసత్యసాయి, గుంటూరు, పల్నాడు వంటి జిల్లాల్లోని ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లుల్లో పని చేస్తున్న వేలాది మంది కార్మికుల ఉపాధికి ఎసరు వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అడపాల ప్రసాద్, పి. మణి, బి, చంద్రయ్య. జి.శశి కుమార్, రమేష్ , సునీల్ పాల్గొన్నారు.

– **సూళ్లూరుపేటలో..** ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాలు నిరసన తెలిపాయి. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్‌కె రియాజ్, సిపిఐ నాయకులు ఇలపా నాగేంద్ర మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, అమెరికా 50శాతం సుంకాలు విధించడం వల్ల దేశీయ ఉత్పత్తులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. నాయకులు ఎస్‌కె అక్బర్ బాష, జె.భాస్కర్, వి.చంద్రయ్య, పి.మహేష్ పాల్గొన్నారు.

– **శ్రీకాళహస్తి** పెండ్లిమండపం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో భారత్‌పై ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ అమెరికా సుంకాల పట్ల మోడీ మెతక వైఖరి వీడాలన్నారు. నాయకులు కత్తిరవి, మల్లికార్జున్, వేణు, కుమార్, రాఘురు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

– **పుత్తూరు టౌన్‌లో** అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సిపిఎం, సిపిఐ నాయకులు ఆర్.వెంకటేష్, డి.మహేష్ మాట్లాడుతూ దిగుమతులపై అమెరికా విధిస్తున్న పన్నులు దుర్మార్గమని అన్నారు. ట్రంప్ చేతిలో మోడీ కీలుబొమ్మగా మారారని, దేశసార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. ఎప్పటికైనా భారతదేశానికి శాశ్వత మిత్రులు సోషలిస్టు దేశాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట మునిక్రిష్ణారెడ్డి, రవి, సుబ్రమణ్యం, గోవిందయ్య పాల్గొన్నారు.

– **సత్యవేడులో** గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్దన్, సిపిఐ నాయకులు అంజాక చిరిరాజు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలను దేశంలోని ప్రతి పౌరుడూ వ్యతిరేకించాలన్నారు. రష్యా దేశం వద్ద తక్కువ ధరకు క్రూడ్ ఆయిల్ కొంటున్నారన్న విషయాన్ని జీర్ణించుకోలేకే ట్రంప్ దేశంపై 50శాతం పన్నులు విధించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అరుణాచలం, మురళి, మునస్వామి, కృష్ణయ్య, కొల్లాపూరి, లక్ష్మి, చంద్ర పాల్గొన్నారు.

– **ఏర్పేడులో** సిపిఎం నాయకులు రంగయ్య నేతృత్వంలో నిరసన తెలిపారు. వెంకటాద్రి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



సత్యవేడులో..



శ్రీకాళహస్తిలో..



గూడూరులో..

వినాయకా..వీడ్కోలు..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

వినాయక చవితి. పడమట ప్రాంతాల్లో దీన్ని పిలారిపండగ, తూర్పు ప్రాంతంలో గణేశ జయంతి ఉత్సవాల పేరుతో నిర్వహిస్తుంటారు. వినాయక చవితి కులమతాలకు అతీతంగా అందర్ని కలిపే పండగ. యువత పెద్ద సంఖ్యలో కేరింతల మధ్య జరుపుకునేది. ఈ ఏడాది వినాయక చవితికి కేవలం ఒక తిరుపతి నగరంలోనే చిన్నాచితక భారీ అన్నీ కలిపి 16కోట్ల రూపాయలకు పైగా విగ్రహాలను ఏర్పాటు చేసి, నిమజ్జనం చేశారు.. దాదాపు పది రోజుల పాటు వివిధ కూడళ్లలో వినాయక విగ్రహాలను పెట్టి ప్రతిరోజూ పూజలు చేసి, ప్రసాదాలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉట్టి కొట్టి బహుమతులను గెలుచుకున్నారు. ఏదిఏమైనా వినాయక చవితి వాడవాడలా ఆనందోత్సాహాల మధ్య పండుగ వేడుక జరిగింది. చివరిరోజు నిమజ్జనం సందర్భంగా లడ్డూలు, కండువాలు, మరికొన్ని బహుమతులను వేలం వేశారు. పెద్దఎత్తున వేలం పాటలో ఆ వస్తువులను భక్తులు కొనుగోలు చేయడం గమనార్హం.

బోలో గణేష మహారాజ్కు జై...గణపతి బొప్పా బోరియా... నినాదాలతో తిరుపతి ప్రాంతంలో గత తొమ్మిది రోజులుగా పులకించి పోయింది. అందులోని సత్యప్రమాణాలకు నెలవైన వరసిద్ధి వినాయకుడు కొలువైన కాణిపాకం గల ఉమ్మడి జిల్లా కావడం. తూర్పున దక్షణ కైలాసంగా పేరుగడించిన శ్రీకాళహస్తి, దక్షిణాన శ్రీపద్మావతి అమ్మవారి క్షేత్రం, ఉత్తరాన కలియుగ శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల ప్రాంతం సరిహద్దులుగా గల తిరుపతి నగరం ఆధ్యాత్మిక క్షేత్రంగా ఎదుగుతోంది. నగరంలో భక్తికి కొదవుండదు. దీంతో పండుగల్లో తొలిదైన వినాయక చవితిని ప్రతి ఒక్కరూ ధనిక, పేద, మధ్యతరగతి తేడా లేకుండా జరుపుకుంటారు. ఈ ఏడాది నగరంలోని ప్రధాన కూడల్లో సుమారు 870 విగ్రహాలు నెలకొల్పినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. ఒక్కో ప్రాంతంలో 8 అడుగల నుంచి 20 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు ఏర్పాటు చేశారు. 8 అడుగల ఎత్తుగల విగ్రహం మార్కెట్లో 16వేల రూపాయలు ధర పలికింది. దీనికి అదనంగా చిన్న చిన్న సందుల్లో 5 నుంచి 6 అడుగుల ఎత్తుగల విగ్రహాలు మరో 500 వరకు ఏర్పాటు చేశారు. వీటి ధర 6 వేల నుంచి 8 వేల రూపాయల వరకు ఉంది. తిరుపతి, తిరుపతి రూరల్లో కలిసి సుమారు లక్షకుపైగా కుటుంబాలు చిన్న చితకా విగ్రహాలను, ఇళ్లల్లో నెలకొల్పి వినాయక చవితిని నిర్వహించారు. ఈ విగ్రహాలన్ని పూజానంతరం అదే రోజు సాయంత్రం, ఐదోవ రోజు, ఏడోవ రోజు, 9వ రోజు సమీపంలోని నీటి గుంటల్లో నిమజ్జనం చేశారు. కేవలం ఒక తిరుపతి నగరంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాలు, చిన్నాచితక, ఇళ్లలోని చిన్న విగ్రహాల విలువ సుమారు 11కోట్ల రూపాయలకు పైచిలుకు ఉంటుందని నిపుణుల అంచనా. వీటన్నింటిని తిరుపతిలోని వినాయకసాగర్, . బొమ్మలక్వార్టర్స్ ఎదురుగా ఉన్న చెరువు, వెంకటాపురం చెరువు, తిరుపతి పరిసరాల్లోని చెరువులు, నీటి గుంటల్లో నిమజ్జనం చేశారు. విగ్రహాల వద్ద అన్నదానం, ప్రతి రోజు ప్రసాదాల పంపిణీ, లడ్డులు ఏర్పాటు, ఉట్లోత్సవం, అరిటిమాన్లు, చెరుకులు, ఎలక్కాయలు, మారేడు, 21 రకాల పత్రులు, కొబ్బరి కాయలకు, కర్పూరం, అగరబత్తిలు, స్వీట్లు, కుడుములు, పాయసం, ఇతరాత్ర పూజ సామాగ్రిలకు కలిపి మరో 7 కోట్లకు పైగా వ్యయం అయుంటుందని అంచనా. ఇది కాకుండా డెకరేషన్ (అలంకరణ), మైక్ సెట్, డ్రమ్స్, మేళతాళాలు అదనం. ఇదంతా కూడా ప్రతి ఇంటి నుంచి చందా రూపంలో వసూళ్లు చేసిన సొమ్మే. పండగల్లో ప్రతి ఒకర్ని భాగస్వాములు చేయాలనే ఉద్దేశంతో ఈ కోవలో సొమ్మును వసూళ్లు చేసి, నగరం మొత్తం వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. యువత ఉత్సాహంగా పండగను జరుపుకున్నారు. దొడ్డాపురం వీధిలో రుద్రాక్షలతో వినాయకుడి విగ్రహం ఏర్పాటు, డిఆర్ మహాల్ సమీపంలోని గాంధీపురం సర్కిల్లో ఏడు రకాల ప్లెయిన్ కాటన్ చీరలతో, టికె స్ట్రీట్లోని కరీమారియమ్మ ఆలయం సమీపంలో దీపస్థంబాలతో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, సంబంధిత వస్తువులను ప్రజలకు కొంత ఉచితంగా, మరికొంత నగదుకు పంపిణీ చేశారు. ఏదిఏమైనా వినాయక చవితి పండుగ యువతలో ఉత్సాహాన్ని నింపింది.

అక్టోబర్ 13, 14 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అక్టోబర్ 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు పుత్తూరు పట్టణంలో సిఐటియు జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించనున్నామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి వెల్లడించారు. 13న సాయంత్రం పట్టణంలో ప్రదర్శన, భారీ బహిరంగసభ ఉంటుందని, ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పాల్గొంటారన్నారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం అధ్యక్షతన జిల్లా కమిటి సమావేశం జరిగింది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ కార్మిక వ్యతిరేక విధానాలు ఉధృతంగా అమలవుతున్నాయని, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, పనిగంటలు, చాలీచాలని వేతనాలు కష్టజీవులను కుంగదీస్తున్నాయన్నారు. తిరుపతి జిల్లాలోని పారిశ్రామికవాడల్లో కార్మికవర్గం తీవ్ర నిర్బంధాలకు గురవుతోందన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభలు డిసెంబర్ 31, జనవరి 4వరకూ ఐదు రోజుల పాటు విశాఖపట్నంలో జరగనున్నాయని తెలిపారు. ఈ మహాసభ జయప్రదానికి కార్మికలోకం తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి కేవీఎన్ ప్రసాదరావు, వందవాసి నాగరాజు, టి సుబ్రహ్మణ్యం, ఎస్ జయచంద్ర, కే వేణుగోపాల్, మాధవ్, ఆర్ లక్ష్మి, మునిరాజ, రాజేశ్వరి, రఘు, రమేష్, బుజ్జి, నాగరాజు, ఇ. మధుసూదన్ రావు, ముకుంద, బాలాజీ, లక్ష్మయ్య అల్లెయ్య, కవిత, లక్ష్మీ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నగర్‌లో ఆక్రమణలు తొలగించండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నగరంలోని ఉపాధ్యాయ నగర్ రోడ్డులో రాకపోకలకు అడ్డంగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా వచ్చిన వినతులను శనివారం అధికారులతో కలసి ఉపాధ్యాయ నగర్, మానస సరోవర్ మార్గంను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ నగర్ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఆక్రమణలు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే ఉపాధ్యాయ నగర్ లో సీసీ రోడ్లు లేని ప్రాంతాల్లో రోడ్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

సుదీర్ఘ పోరాట ఫలితం

శెట్టిపల్లి వాసుల్లో సంతోషం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'భూముల కోసం సుదీర్ఘ పోరాటం.. ఎట్టకేలకు ఫలించింది.. క్యాబినెట్‌లో ఆమోదం లభించింది.. కార్పొరేషన్ పరిధిలో ఉన్న భూమిని తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్‌లో కలుపుతూ నిర్ణయం చేశారు.. దీంతో శెట్టిపల్లి వాసుల్లో సంతోషం వెల్లివిరిసింది.. చిన్నచిన్న ప్లాటుదారులకు రెండు సెంట్లు ఇస్తామన్న ప్రకటన లబ్ధిదారుల్లో ఆనందాన్ని తెచ్చింది.. దాదాపు 2,400 మంది లబ్ధిదారులు సొంత ఇల్లు నిర్మించుకునేందుకు సిద్ధమవుతున్నారు. రెండు రోజుల్లో జీవో వస్తుందని స్వయంగా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ చెప్పారు. అక్టోబర్ 15కల్లా పట్టాలు మంజూరు చేస్తామని చెప్పారు. మోడల్ టౌన్‌సిటీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. చెప్పినట్లు చేస్తే నిజంగా శెట్టిపల్లి వాసుల్లో 'దీపావళి' ముందే రానుంది.

తిరుపతి నగర పరిధిలోని శెట్టిపల్లి అన్‌సెటిల్డ్ ఇనామ్ ఎస్టేట్ విలేజ్. సర్వే లెక్కల ప్రకారం దాదాపు 636 ఎకరాలున్నాయి. దాదాపు 500 కుటుంబాలు వ్యవసాయాన్నే జీవనాధారంగా నమ్ముకుని జీవించేవారు. 3-5-1979లో ఇనామ్ చట్టం రద్దయ్యింది. అదే ఏడాది జూన్ 25న శెట్టిపల్లి గ్రామం ఏర్పాటయ్యింది. 1980-81 మధ్యకాలంలో సాగులో ఉన్న భూములను గుర్తించి, సర్వే నిర్వహించి రఫ్ పట్టాలను అప్పటి కలెక్టర్ మంజూరు చేశారు. ఈ నేపథ్యంలోనే 82.67 ఎకరాలను రైల్వేశాఖ తిరుపతి రైల్వే క్యారేజ్ రిపేర్ షాపు (సిఆర్ఎస్)కు తీసుకుని పరిహారం చెల్లించింది. భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగాన్ని కల్పించింది. భూముల క్రయవిక్రయాలు సైతం భారీగా జరిగాయి. ఒకే ప్లాటును ఇద్దరు ముగ్గురికి విక్రయించినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ వివాదానికి బ్రేక్ వేస్తూ 2015లో సిఎం చంద్రబాబునాయుడు శెట్టిపల్లి భూములను 22ఎలో చేర్చారు. దీంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. శెట్టిపల్లి భూపోరాట సాధన కమిటీగా ఏర్పడి దాదాపు దశాబ్దకాలం పాటు పోరాటాన్ని నడిపారు. వీరికి సిపిఎం ప్రత్యక్షంగా మద్దతు పలికి అండగా నిలిచింది. ఈ సందర్భంగా లబ్దిదారులు తమ సంతోషాన్ని 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. వారి మాటల్లోనే..

పోరాట ఫలితమే..: శెట్టిపల్లి ఇళ్ల సాధన కమిటీ అధ్యక్షులు రాధాకృష్ణ




రాష్ట్ర క్యాబినెట్‌లో శెట్టిపల్లి సమస్య పరిష్కారం అయ్యిందంటే పోరాట ఫలితమే. ముఖ్యంగా సిపిఎం నేతలకు, అఖిలపక్ష పార్టీల నాయకులకు మా కృతజ్ఞతలు. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తుడాకు భూములను బదలాయిస్తూ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది. రైతుల వద్ద వ్యవసాయ భూమి ఉంటే 30 శాతం వారికి కేటాయించి, 70 శాతం ప్రభుత్వం తీసుకోనుంది. లేఔట్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న ఇళ్లస్థలాలకు సంబంధించి 50:50నిష్పత్తి ప్రకారం తీసుకుంటారు. ఏదిఏమైనా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. కలెక్టర్లు, రెవెన్యూ యంత్రాంగం చేసిన కృషి మా పోరాటానికి సాయపడింది. కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులకూ అభినందనలు.

మా కల ఫలించింది : హేమలత



ఎన్నో ఏళ్లుగా కలగానే ఉన్న శెట్టిపల్లి భూముల సమస్య ఫలించింది. కొన్నేళ్లుగా తిరుపతిలో అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నాం. శెట్టిపల్లిలో నాలుగు సెంట్లు భూమి ఉన్నా ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి. 14 సంవత్సరాల పాటు పోరాడం. న్యాయం జరిగింది. ప్లాటు ఇచ్చిన వెంటనే ఇల్లు నిర్మించుకుంటాం. సొంత ఇంట్లో ఉంటామనే ఆనందం మా కుటుంబ సభ్యుల్లో ఉంది.

1978లో కొన్నాను : ప్రభాకర్‌నాయుడు



శెట్టిపల్లిలో 1978లో ఎనిమిది ఎకరాల భూమి కొన్నాను. 2012లో భాగ పరిష్కారం చేసుకున్నాం. అంతలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ భూములు రిజిస్ట్రేషన్ జరగకుండా బ్యాన్ విధించింది. మా పిల్లలకు పెళ్లిళ్ల చేయాలనుకున్నపుడు భూములు అమ్ముకోడానికి వీల్లేకుండా పోయింది. గత కొన్నేళ్లుగా పోరాడుతూనే ఉన్నాం. మూడు తరాల వారు అనేక ఇబ్బందులు పడ్డారు. అప్పులు చేసి పెళ్లిళ్ల చేశాం. ఇపుడైనా మా తరానికి మేలు జరిగింది.

సిపిఎం పోరాటంతోనే కదలిక : తేజశ్వి



శెట్టిపల్లిలో మాకు 3 ఎకరాల 70 సెంట్ల భూమి ఉంది. అన్‌సెటిల్మెంట్‌గా ఉండేది. సిపిఎం పోరాట ఫలితంగా ప్రభుత్వంలో కదలిక వచ్చింది. తాడోపేడో తేల్చుకుంటామని ప్రకటించడంతో క్యాబినెట్లో శెట్టిపల్లి భూ సమస్యకు మార్గం సుగమం అయ్యింది. మా వంశంలో మూడు తరాల వాళ్లం ఎదురుచూసి విసిగిపోయాం. నాలుగో తరానికి ఉపశమనం లభించింది. తుడా వారు తక్షణమే మోడల్ టౌన్‌షిప్ నిర్మాణ పనులు చేపట్టి అక్టోబర్ 15 నాటికి పట్టాలు ఇవ్వాలి. ప్రభుత్వ యంత్రాంగానికి రుణపడి ఉంటాం.

9న 'అన్నదాన పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చంద్రగిరి, తిరుపతి సిటి

రాష్ట్రవ్యాప్తంగా రైతులు పడుతున్న సమస్యలపై 9న మంగళవారం జరిగే 'అన్నదాత పోరు'ను విజయవంతం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు మల్లం చంద్రమౌళిరెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ తుమ్మలగుంటలోని చంద్రగిరి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శనివారం 'అన్నదాత పోరు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వంలో పంటల సాగుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, వరి పంటకు సరిపడా యూరియా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందన్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను పంపిణీ చేస్తే,ఈ ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తోందన్నారు.

తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద జ రిగే అన్నదాత పోరు పోస్టర్‌ను వైసిపి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. పద్మావతిపురంలోని వైసిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, ఎరువులు పక్కదోవ పట్టిస్తున్న వారిపై కటిన చర్యలు తీసుకోవాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ శిరీష, నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.



జాతీయ మహిళా సాధికారత కాన్ఫరెన్స్ ఏర్పాట్లు పరిశీలన



ప్రజాశక్తి - చంద్రగిరి

సెప్టెంబర్ 14, 15 తేదీలలో తిరుపతి జిల్లాలో జరుగు జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్ కు చేపట్టవలసిన ఏర్పాట్లపై ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ సెక్రెటరీ జనరల్ ప్రసన్నకుమార్, జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ జిల్లా ఎస్ పి, హర్ష వర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మునిసిపల్ కమీషనర్ నారపు రెడ్డి మౌర్య లతో కలిసి శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ మినీ కాన్ఫెరెన్స్ హాల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ మహిళా సాధికారిత కు కాన్ఫరెన్స్ విజయవంతం అయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబందిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ సెక్రెటరీ జనరల్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ నందు జాతీయ మహిళా సాధికారిత కాన్ఫరెన్స్‌కు దేశంలోని ప్రతి రాష్ట్రం నుండి సభ్యులు హాజరు అవుతారన్నారు. వీరందరూ రెండు రోజుల పాటు మహిళల సమస్యల మీద సుదీర్ఘంగా చర్చిస్తారన్నారు.ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల వారు సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ కాన్ఫరెన్స్‌కు లోక్‌సభ, శాసనసభ స్పీకర్లు, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు విచ్చేస్తారన్నారు. తిరుపతి రాహుల్ కన్వర్షన్ సెంటర్‌లో ఈ కాన్ఫరెన్స్ జరుగుతుందన్నారు. కమిటి సభ్యులు చంద్రగిరి కోటను సందర్శించనున్నారని, టూరిజం అధికారులతో కలిసి పర్యవేక్షించి ప్రముఖులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. చంద్రగిరి కోటకు చేరుకునే మార్గంలో అప్రోచ్ రోడ్లు, చంద్రగిరి కోట వద్ద బ్యారికేడ్ల ఏర్పాటు, స్టేజ్ వద్ద ఎల్ ఈ డి స్క్రీన్ తదితర ఏర్పాట్లపై సంబందిత అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి, ఆర్ డి ఓ లు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, ప్రోటోకాల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివశంకర్ నాయక్, అడిషినల్ ఎస్.పి. రవిమనోహరాచ్చారి, డిపిఓ సుశీల దేవి పాల్గొన్నారు.

14న బలిజసేన రాష్ట్రస్థాయి సమావేశం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ సెప్టెంబర్ 14న ఆదివారం ఉదయం 10 గంటలకు బలిజసేన రాష్ట్రస్థాయి సమావేశం జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ ఈ సమావేశానికి జిల్లాలోని బలిజ, కాపు, తెలగ, ఒంటరి కులస్తులు తమతమ అభిప్రాయాలు తెలిపేందుకు రావాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న హోటల్ ఉదయ్ ఇంటర్నేషనల్‌లో ఈ సమావేశం ఉంటుందని తెలిపారు.

మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా సుధాకర్ నాయుడు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల టీడీపీకి విశిష్ట సేవలందించిన మండల పార్టీ ప్రెసిడెంట్ మావిళ్లపల్లి సుధాకర్ నాయుడు సతీమణి, మాజీ జడ్పీ టీసి సముద్రాల సుధాకర్ నాయుడు చెల్లెలయిన మావిళ్లపల్లి జ్యోతి సుధాకర్ నాయుడుకి, మూడు మండలాలకు సంబంధం అయిన ఎఎంసి చైర్మన్‌గా, సత్యవేడు నియోజకవర్గం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి సహకారంతో సీఎం ఈ పదవి ఇవ్వడం జరిగింది. ఆయనను చెరుకూరి మునిచంద్ర నాయుడు, మాజీ జడ్పీటీసీ వీర రాఘవులు, సముద్రాల రవి నాయుడు, మధు నాయుడు, కార్తీక్, కమ్మ సంఘం అధ్యక్షులు కేశవులు నాయుడు, బీసీ నాయకులు భాస్కర్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు మునిరాజ, ఎస్సీ నాయకులు మనోహర్, పల్లమల అశోక్, వెంకటరత్నం, మండల పార్టీ నాయకులు సత్కరించారు.

పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా మహేంద్ర



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా హెచ్.మహేంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. మహేంద్ర గతంలో పుత్తూరు ఆర్టీసీ డిపోలో మెకానికల్ ఫోర్‌మెన్‌గా నాలుగు సంవత్సరాలు పనిచేశారు. అనంతరం తిరుపతి డివిజన్‌లో వివిధ విభాగాల్లో విధులునిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మహేంద్రను సత్కరించారు.

ఆలత్తూరు రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని ఆలత్తూరు రహదారి గుంతలమయమై రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణమంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ఆర్టీసీ బస్సులు కూడా ఈ గుంటల్లో ప్రయాణం కొనసాగించడం కష్టంగా ఉండటంతో అధికారులు బస్సు సర్వీసులు తగ్గించేశారు. దీంతో ప్రయాణికులు అవస్థ వర్ణణీతంగా ఉంది. ఈ విషయమై స్థానికులు ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, స్పందించిన ఎంపీడీవో వెంకటరత్నమ్మ తక్షణ చర్యలను చేపట్టారు. ఓవర్ లోడ్‌తో భారీ వాహనాలను తిప్పుతున్న క్రషర్ యాజమానులకు నోటీసులు జారీ చేశారు. దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టకపోతే క్రషర్‌లను శాశ్వతంగా మూసివేస్తామని హెచ్చరించారు. క్రషర్ యాజమానులు స్పందించి ఆలత్తూరు రహదారికి మరమ్మతులు చేయించారు.

టీటీడీని ప్రయోగశాలగా మార్చకండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీటీడీలో తక్కువ జీతానికి ఉద్యోగంలో చేరి, ఉద్యోగ విరమణ వరకు శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలందిస్తూ, శ్రీవారి ఆస్తులను సంరక్షిస్తున్న శాశ్వత ఉద్యోగస్తులకు అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని, కోర్టు కేసులను బూచిగా చూపి కాలయాపన చేసిన గత ప్రభుత్వానికి, అప్పట్లో సహకారం అందించిన అధికారుల కారణంగా ప్రభుత్వానికి అపకీర్తి వచ్చే ప్రమాదం ఉందని తిరుపతికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు నవీన్ కుమార్ రెడ్డి సీఎంకు విజ్ఞప్తి చేశారు. టీటీడీలో ప్రతినెల అనేకమంది ఉద్యో విరమణ చేసి వెళ్తున్నారే కానీ నూతన ఉద్యోగ అవకాశాల నోటిఫికేషన్ జాడే లేదన్నారు. టిటిడి చైర్మన్, ఈవో, అడిషనల్ ఈవో, తిరుపతి జేఈవోలు స్పందించి టిటిడి, స్విమ్స్ ఉద్యోగస్తుల పదోన్నతులపై టిటిడి బోర్డులో సానుకూలంగా స్పందించేలా ఆదేశాలివ్వాలని నవీన్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేస్తూ సీఎంకు లేఖ రాశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి -కోట: కోట, ఎన్సీఆర్ నగర్‌లో పంచాయతీ పైపులైను పగిలిపోయి నీరు మొత్తం రోడ్డుమీదకి ప్రవహిస్తోంది. ఈ విషయాన్ని స్థానికులు నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఉప సర్పంచ్ గాది భాస్కర్‌ని సంఘటనా స్థలానికి పంపించి పైపులైనుకు మరమ్మత్తులు చేయించారు. ఎన్‌సిఆర్ నగర్ కాలనీవాసుల తాగు నీటి ఇబ్బందిని తీర్చారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు పంచాయతీ, బీసీ బాలుర వసతి గృహం సమీపంలో శనివారం రూ. 5 లక్షలు ఆర్డబ్ల్యూఎస్ నిధులతోడ్రైనేజీ పనులకు టిడిపి మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, బాలాజీ, కేసినేని సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో జడ్జి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీ హై కోర్టు జడ్జి సట్టి సుబ్బారెడ్డి శనివారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ ఏఈఓ మోహన్ సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి ఆలయ వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఉపాధ్యాయులు జాతి నిర్మాతలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పుతూ ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే గురువు స్థానం గొప్పదని కల్లివెట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు, నాదెండ్ల మురళి, లక్ష్మయ్య, జగన్నాథం, మాధవీలత, సుజన, దీపిక, రత్నమ్మ, హరిత తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ గవర్నన్నెన్స్ సేవలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - వాకాడు: మండల కేంద్రంలోని అశోక్ పిల్లర్ సెంటర్ వద్ద ఎంపీడీవో శ్రీనివాసులు, తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్ ప్రజలకు శనివారం వాట్సాప్ గవర్నర్స్ సేవలపై అవగాహన కల్పించారు. ప్రజలకు త్వరగా, నాణ్యమైన సేవలను అందించడమే వాట్సప్ గవర్నన్నెన్స్ ఉద్దేశమన్నారు. ప్రతి పౌరుడు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఇంటికి వెళ్లి ఈ సేవలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడి పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రాపురం : ప్రభుత్వం కిశోర బాలికలకు అంగన్వాడి ద్వారా అందించే పథకాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నెత్తకుప్పం ప్రధానోపాధ్యాయురాలు తులసి కుమారి సూచించారు. నెత్తకుప్పం ఉన్నత పాఠశాలలో శనివారం మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమాన్ని అంగన్వాడి సూపర్వైజర్ రేవతి నిర్వహించారు. చంద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్, సిడిపిఓ ప్రదీప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీతిక, హారతిదేవి, మునిరత్నం, అంగన్వాడి కార్యకర్తలు నీలావేణి, దేవిక, సరళ, మునెమ్మ, కిశోర బాలికలు పాల్గొన్నారు.

'మన మిత్ర'పై ఇంటింటి అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు : జి ఎస్ డబ్ల్యూ ఎస్ డైరెక్టర్ ఆదేశాల మేరకు వాట్సప్ గవర్నెన్స్ లో భాగంగా ప్రతి నెల నిర్వహించే అవేర్నెస్ ర్యాలీకి బదులుగా ఈనెల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తమకు మ్యాప్ అయినా క్లస్టర్ నందు ప్రతి ఇంటిని సందర్శించి వారికి వాట్సప్ గవర్నెన్స్ పై అవగాహన కల్పిస్తారని, ప్రతి ఒకరు భాగస్వాములు కావాలని ఏర్పేడు తాసిల్దారు ఎం భార్గవి తెలిపారు.

మహిళా వర్శిటీలో టీచర్స్ డే వేడుకలు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, సావేరి అతిథి గృహంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్సిటీ విసి ఆచార్య వి.ఉమ హాజరయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. వర్సిటీలో అధ్యాపకులను ప్రోత్సహించేందుకు ప్రొఫెసర్ ఎస్.రత్నకుమారి (మాజీ ఉపకులపతి, (శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం), ప్రొఫెసర్ ఎ. జ్యోతి (రిటైర్డ్ హోమ్ సైన్స్ ప్రొఫెసర్), ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి (కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం)ల పరిశోధన పురస్కారాలను అందిస్తున్నారు. విశ్వవిద్యాలయ పరిశోధన అవార్డు - 2025 అవార్డులు ప్రొఫెసర్ టి. శోభా రాణి - కమ్యూనికేషన్, జర్నలిజం విభాగం, ప్రొఫెసర్ కె. ఉషా రాణి - కంప్యూటర్ సైన్స్ విభాగం, నవీన పరిశోధన అవార్డు - 2025, ప్రొఫెసర్ చి.ఎమ్. కుమారి చిట్టూరి - అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగం, ఇంటర్‌డిసిప్లినరీ/ట్రాన్స్‌డిసిప్లినరీ/ట్రాన్స్‌లేషనల్ రీసెర్చ్ అవార్డు- 2025 ప్రొఫెసర్ వి. నిర్మల- ఇంగ్లీష్ విభాగం, ప్రొఫెసర్ జి. రజిత- ఫార్మస్యూటికల్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్, టాలెంట్ రీసెర్చ్ అవార్డు- 2025 డా. ఎం. వాణి- అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగం, వై.శాంతిప్రియ - బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం, వీరిని పురస్కరించి అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విద్యార్థి దశనుంచే ప్రజా సంబంధాలను పెంపొందించుకోవాలని ఎంఆర్ పల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్.హరనాథరెడ్డి పేర్కొన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలోని ఎంఆర్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా "ఉపాధ్యాయుడు - విద్యార్థి సంబంధాలు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎడ్యుకేషనల్ అడ్వైజర్ కెవిఎస్ ప్రకాష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి యువత వారధులుగా నిలవాలన్నారు. ఎస్వీయు తెలుగు విభాగం పరిశోధక విద్యార్థి గరికపాటి రమేష్ బాబు మాట్లాడుతూ సమాజాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లేది ఉపాధ్యాయ వృత్తి మాత్రమే అన్నారు. ఈనంతరం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఆర్ పల్లి జడ్పీ హైస్కూల్‌లో సేవలందిస్తున్న బయాలజీ ఉపాధ్యాయులు సి.మునికృష్ణ, కె.ఉమాదేవి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు ఎం.నీరజను పిఆర్ఎస్ఐ ఆధ్వర్యంలో మెమెంటో, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ జె.ఎస్.ప్రసాద్, సెక్రటరీ దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి కె.మధుసూదన్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాసరావు, పిఆర్ఎస్ఐ పూర్వ ఛైర్మన్ డా. సి.స్వరాజ్యలక్ష్మి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం



ప్రజాశక్తి - నాయుడుపేట: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నాయుడుపేటలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శనివారం గురువులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆరు మంది ఉత్తమ ఉపాధ్యాయులను సాయంత్రం సత్కరించారు. నాయుడుపేట ఎంఈఓలు కె.మాధవి, లక్ష్మీకళ్యాణి, బాణాల మునిరత్నంల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనంభేటీ విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ కొరగొండ్ల ధనలక్ష్మి, నాయుడుపేట ఎంపీడీవో శివకుమార్ ముఖ్యఅతిథిదులుగా పాల్గొన్నారు. మండలంలోని ఉపాధ్యాయులంతా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

ఉత్తమ ప్రభుత్వ పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్‌గా కుమార్



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పిల్లారుపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఎస్.వి.కుమార్ విద్యారంగంలో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. విజయవాడలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సీఎం చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకున్నారు. ఆయనకు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

ఎస్వీయూ ఉత్తమ అధ్యాపకులుగా డాక్టర్ కె.సునీత



ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ ఆర్ట్స్ విభాగం, అసిస్టెంట్ ప్రొఫెసర్ విభాగంలో ఉత్తమ అధ్యాపకులుగా డాక్టర్ కె. సునీత అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఇన్చార్జి విసి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ వంటి విభాగాల వారీగా 2024 - 25 సంవత్సరానికి ఉత్తమ పర్ఫామెన్స్ సాధించిన అధ్యాపకులను వర్సిటీ తరపున ఎంపిక చేసి ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. డాక్టర్ కె. సునీత ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ జీవితకాల సభ్యురాలుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో శాస్త్రీయ వేదికలలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నీరజకు ఉత్తమ అధ్యాపక పురస్కారం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలుగా పనిచేస్తున్న డాక్టర్ పి. కుమారి నీరజ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలుగా అవార్డును అందుకున్నారు. గురుపూజోత్సవం సందర్భంగా విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శుక్రవారం ఆమె అవార్డును, పురస్కారాన్ని అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజశేఖర్ రెడ్డి, అధ్యాపక బృందం నీరజను శనివారం ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. పరిశోధన, బోధనా రంగాలలో నీరజ చేసిన కృషికి గాను ఈ అవార్డు దక్కింది. రొంపిచెర్ల మండలం, బాలనాగిరెడ్డి గారి పల్లెలో పొన్నం రెడ్డి రెడ్డప్ప రెడ్డి, యశోదమ్మలకు ఐదవ సంతానంగా 14 జూన్ 1978లో నీరజ జన్మించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2004లో జూనియర్ లెక్చరర్ గా, 2010లో డిగ్రీ లెక్చరర్ గా అధ్యాపక వృత్తిని స్వీకరించి బోధనలో, పరిశోధనలో తనదైన ముద్రను వేశారు. ఆమె కృషికి గాను అనేక అవార్డులు దక్కాయి.

డాక్టర్ వేణు మాధవ్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆది శంకర యూనివర్సిటీ డీన్ డాక్టర్ వేణు మాధవ్‌కు విద్యార్థి ప్లేస్‌మెంట్, కెరీర్ అభివృద్ధిలో అద్భుత కృషి అవార్డును అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని సిఎస్ఈ ఇండియా తరపున టీచర్స్ డే సందర్భంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

దశ, దిశా నిర్దేశకులు ఉపాధ్యాయులే : ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : భావి తరాలకు దిశా నిర్దేశించే వారు ఉపాధ్యాయులేనని, గురువులకు కూటమి ప్రభుత్వం గౌరవప్రదమైన స్థానం ఇస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే భాను ప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరులో శనివారం జరిగిన గురు పూజోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని, ఉపాధ్యాయులకు అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ డిఎస్ గణేష్, మాజీ ఎంపీపీ ఎలుమలై అమ్ములు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగం రెడ్డి, పి కుప్పయ్య, టిడిపి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉత్తమ ఆచార్య అవార్డు స్వీకరిస్తున్న శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎంసీఏ విభాగం సీనియర్ ఆచార్యులు ఆచార్య పి.వెంకటకృష్ణ, ఎస్వీయూ పాపులేషన్ స్టడీస్ విభాగం ఆచార్య చంద్రశేఖరయ్య, ఎస్వీయూ బయో కెమిస్ట్రీ విభాగం ఆచార్య ఎం బాలాజీ (ప్రజాశక్తి - క్యాంపస్)

విద్యుత్ సరఫరాలో అంతరాయం


ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి పరిధిలో తిరుచానూరు సెక్షన్, దామినేడు సెక్షన్‌లో ఫీడర్లు మెయింటెనెన్స్, మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చంద్రశేఖర రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. తిరుచానూరు , వైష్ణవి నగర్, వసుంధర నగర్, యోగిమల్లవరం, కె.పి లే ఔట్ , శిల్ప రామం, కె.ఆర్ నగర్, గజలక్ష్మి నగర్, నేతాజీ స్ట్రీట్ , సి.ఆర్ రాజన్ కాలని, దామినేడు తదితర పరిసర ప్రాంతాల వినియోగ దారులు సహకరించాలని కోరారు.

నాయుడుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ విజయ శ్రీ పర్యటన



ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ శనివారం పర్యటించి పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఆమె తన సోదరుడు నాయుడుపేట పట్టణ టిడిపి యువ నాయకుడు నెలవల రాజేష్ జన్మదిన వేడుకలకు విచ్చేసి పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె టిడ్కో గృహాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ టిడ్కో గృహాలు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 80 శాతం పూర్తయినప్పటికీ ఎన్నికల కారణంగా ప్రజలకు అందించలేకపోయామన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం లబ్ధిదారులను మోసం చేసిందని, ఇళ్లను శిథిలావస్థకు చేర్చిందని ధ్వజమెత్తారు. ఎవరు చింతించవలసిన అవసరం లేదని అతి త్వరలో ఈ గృహ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎస్.కె పజిల్లుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ 786 ఎస్.కె రఫీ, మాజీ జెడ్పిటిసి పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, టిడిపి నాయకులు పసల గంగా ప్రసాద్, అవధానం సుధీర్, అశోక రెడ్డి మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

యువ నాయకుడి జన్మదిన వేడుకలు




సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం తనయుడు, సూళ్లూరుపేట శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ సోదరుడు, నాయుడుపేట పట్టణ టిడిపి యువ నాయకుడు నెలవల రాజేష్ జన్మదిన వేడుకలు నాయుడుపేటలోని ఆయన నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, టిడిపి అభిమానులు హాజరై రాజేష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. భారీ కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసానంబేటి విజయభాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, మున్సిపల్ వైస్ వైస్ చైర్మన్ టిడిపి పట్టణ అధ్యక్షులు 786 ఎస్.కె.రఫీ, సూళ్లూరుపేట నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ ఉయ్యాల ప్రవీణ్, టిడిపి నాయకులు, పలుకూరు ముత్యాలయ్య, కట్ట వెంకటరమణారెడ్డి, ఎస్ జె జ్యువెలర్స్ అధినేత టిడిపి నాయకులు పొట్లపూడి రాజేష్, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు అవధానం సుధీర్ పలువురు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో గ్రాండ్ పేరెంట్స్ డే



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ఎంజీఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరై సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఎంజీఎం సంస్థల చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు మనవడు, మనవరాలుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. అనంతరం గ్రాండ్ పేరెంట్స్ కు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్, కాలేజీ ప్రిన్సిపాల్ సుబ్బరత్నం, ప్రధానోపాధ్యాయులు మునిరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిజెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడుకి ఘన స్వాగతం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన నాలి మధుసూదన్ యాదవ్ ఎన్నికయ్యారు. శుక్రవారం గుంటూరులో భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసిన అనం తరం, రాష్ట్ర అధ్యక్షుడిగా మధుసూదన్ యాదవ్ గూడూరుకు విచ్చేశారు. ఆయన ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని విగ్నేశ్వరపురం వద్ద ఉన్న వినాయకుడి గుడిలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అక్కడనుండి బయలుదేరిన మధు యాదవ్‌కు పెద్ద సంఖ్యలో అభిమానులు, బిజెఎంఎస్ కార్మిక సంఘ సభ్యులు గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా గూడూరు పట్టణ పురవీధుల గుండా రెండో పట్టణంలోని మహా లక్ష్మమ్మ గుడి వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకుని అనంతరం ఇంటికి చేరుకున్నారు.

శ్రీసిటీని సందర్శించిన 'చెన్నై ఏంజిల్స్' బృందం



ప్రజాశక్తి - సత్యవేడు: చెన్నై ఏంజిల్స్ సంస్థకు చెందిన 19 మంది ప్రతినిధులు రెండు రోజుల పర్యటనలో భాగంగా శ్రీసిటీని సందర్శించారు. కె.మహాలింగం నేతృత్వంలోని బృంద సభ్యులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రపంచశ్రేణి మౌళిక సదుపాయాలు, వ్యాపార అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ గురించి వివరించారు. 2009 లో ఏర్పాటైన చెన్నై ఏంజిల్స్ సంస్థ, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, వాటి వృద్ధిని వేగవంతం చేయడంలో అపార వ్యాపార చతురత, అనుభవం, నెట్‌వర్క్ కలిగివుంది. ఈ సందర్శన పట్ల సంతోషం వ్యక్తం చేసిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వీరి ఆలోచనలను పంచుకోవడం ద్వారా శ్రీసిటీ భవిష్యత్తు వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌ను మెరుపరిచేందుకు ఉపయోగపడుతుందన్నారు. పర్యటనలో భాగంగా, ప్రతినిధి బృందం ఇదే సమయంలో శ్రీసిటీ సందర్శనలో వున్న విఎస్ఎన్ఎల్ మాజీ చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ టి.హెచ్.హనుమాన్ చౌదరితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టెలికాం రంగంలో అపార అనుభవం కలిగిన చౌదరి, ఆయన అనుభవాలను, పలు సాంకేతిక అంశాలను వారితో పంచుకున్నారు. సాంకేతిక పురోగతిని సాంస్కృతిక విలువలతో సమలేఖనం చేయడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, భారత్‌ను విశ్వగురువుగా మార్చాలనే తన దార్శనికతను కూడా ఆయన వివరించారు. శ్రీసిటీ ఎండీ, ఇతర అధికారులతో సమావేశమైన చెన్నై ఏంజెల్స్ ప్రతినిధి బృందం, శ్రీసిటీ కార్యకలాపాలు, పెట్టుబడి సామర్థ్యం, వ్యాపార అవకాశాలపై లోతైన అవగాహన పొందారు. డైకిన్, ఇసుజు, కోల్గేట్, ఎప్యాక్, ఎవర్‌వోల్ట్, సిఈటిసి తదితర ప్రముఖ కంపెనీలను సందర్శించారు. రెండవ రోజు పర్యటనలో శనివారం శ్రీసిటీ పరిసరాలతో పాటు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్), నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రాలకు విహారయాత్ర చేశారు.

శ్మశాన సమస్యలను పరిష్కరించండి : సిపిఎం



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో నెలకొన్న స్మశాన సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాశి నాగరాజు శనివారం జిల్లా రెవెన్యూ అధికారికి వినతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మశాన సమస్యలు కూడా పరిష్కరించే పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం లేదంటే చాలా సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కే.వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షోకు రెండవ రోజూ విశేష ఆదరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మూడు రోజుల పాటు నిర్వహించనున్న క్రెడాయ్ ప్రాపర్టీ షోకు మొదటి రోజు శుక్ర, శని వారాల్లో మంచి స్పందన వచ్చిందని ఆ సంస్థ చైర్మన్ గోపీనాథ్ తెలిపారు. తిరుపతి, పరిసర ప్రాంతాల ప్రజలనుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. ఈసారి బీఎండబ్ల్యూ కార్లు, ద్విచక్ర వాహనాలు, లగ్జరీ వాహనాలు కూడా స్టాల్స్‌లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత 12 సంవత్సరాలు నుంచి తాము ఈ ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నామని తెలిపారు. తిరుపతి నగరవాసులకు అపార్ట్మెంట్లు, విల్లాలు, గృహాలు, నిర్మించి.. గృహ నిర్మాణ రంగంలో తమ సంస్థ ఎంతో సేవలో అందిస్తోందన్నారు. రాష్ట్రం వ్యాప్తంగా తమ సంస్థ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సిమెంటుపై జీఎస్టీ తగ్గించడం అభినందనీయమన్నారు. గృహ నిర్మాణ రంగం మరింత వేగవంతమవుతుందన్నారు. శ్రీ కన్వెన్షన్ హాల్లో ఆదివారం కూడా ఈ ప్రదర్శన ఉంటుందని, ఇందులో 57 స్టాల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. వినియోగదారులు ఎలాంటి విషయాలైనా ఇక్కడ తెలుసుకొని, అప్పటికప్పుడే కొనుగోలు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ముఖ్యంగా గృహ నిర్మాణరంగానికి కావాల్సిన మెటీరియల్‌ను ఎంచుకునే అవకాశం ఉందన్నారు. క్రెడాయ్ ఎం.రాంప్రసాద్ మాట్లాడుతూ తుడా అనుమతులు తీసుకొని తమ సంస్థ గృహ నిర్మాణ రంగంలో నిర్మాణ పనులు చేస్తున్నామని, ప్రజలకు అన్ని రకాల వసతులతో కూడిన నిర్మాణాలు చేస్తున్నామని వెల్లడించారు. తమ దగ్గర కొనుగోలు చేసిన అపార్ట్మెంట్లు, విల్లాలు, డూప్లెక్స్ ఇళ్లకు కూడా మంచి ఆదరణ లభిస్తోందన్నారు. వివిధ జాతీయ బ్యాంకులు ఈ ప్రాపర్టీ షోలో పాల్గొనడంతో విశేష ఆదరణ లభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ బాబు, సెక్రటరీ నరసింహ రెడ్డి, ట్రెజరర్ హరికృష్ణలు కోరారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి -కోట : రీ సర్వేలో భూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని తాహశీల్దార్ కే.రావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కోట మండలం, అల్లంపాడు పంచాయతీలో రీ సర్వే పై గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జె జె రావు మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిశీలించి త్వరలో పరిష్కారం చేస్తామని రైతులకు తెలియజేశారు.

క్రైం న్యూస్

గ్రానైట్ లారీ.. బస్సు ఢీ.. ప్రయాణికులకు గాయాలు



ప్రజాశక్తి - చంద్రగిరి : మండల పరిధిలోని పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై రాయల కోట సమీపంలో శనివారం తెల్లవారు జామున ముందు వెళుతున్న గ్రానైట్ లారీని శ్రీకాళహస్తి డిపోకి చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 27మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ కండక్టర్ రత్న, డ్రైవర్ ఖాదర్ బాషా, ప్రయాణీకురాలు భాగ్యమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు బెంగళూరు నుండి తిరుపతి వైపు వస్తున్న కాళహస్తికి చెందిన బస్సు 43 మంది ప్రయాణికులతో శ్రీకాళహస్తికి వస్తుండగా చంద్రగిరి కోటకు వెళ్లే దారి సమీపంలో, చిత్తూరు వైపు నుండి తిరుపతి వైపు ముందు వెళుతున్న గ్రానైట్ లారీని డ్రైవర్ నిద్రమత్తులో ఉండి ఢీకొన్నట్లు తెలిపారు. 108 వాహనం, జాతీయ రహదారి అంబులెన్సుల ద్వారా చంద్రగిరి ఏరియా ఆసుపత్రి, తిరుపతి రుయాకు క్షతగాత్రులను తరలించారు. ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం లేదు. తీవ్ర గాయాలైన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. చంద్రగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



ఎన్. శ్రీధర్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు మండలం, చింతల పాలెంలో నూతన ఆలయ నిర్మాణం సందర్భంగా కుంభాభిషేకం జరుగుతుండగా, అదే గ్రామానికి చెందిన ఎన్. శ్రీధర్ (45) హార్ట్ స్ట్రోక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు, భార్య ఉందని స్థానికుల తెలిపారు. కార్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడని తెలిపారు. ఈ ఘటనతో గ్రామస్తులు కుంభాభిషేకం నిలిపివేశారు.

అధిక వేడిమితో కారు దగ్ధం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఇంజన్ ఓవర్ హీట్ కావడంతో ఒక కారు దగ్ధమైన ఘటన శనివారం రాత్రి తిరుపతిలో చోటు చేసుకుంది. తిరుపతి కరకంబాడి రోడ్, లీలామహల్ సర్కిల్ వద్ద ఓ కారులో ఉన్నఫళంగా మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్‌తో అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. 2014 మోడల్ షిఫ్ట్ కారు సరైన మెయింటెనెన్స్ లేకపోవడంతోనే బ్యాటరీ ఓవర్ హీట్‌కు గురై మంటలు చెలరేగాయని ఫైర్ అధికారులు తెలిపారు.

బయో ఫెర్టిలైజర్స్ వాడకంపై అవగాహన



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: నానో యూరియా వాడకంతో రైతులకు ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువవుతుందని ఏడిఏ రమేష్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు రైతు సేవా కేంద్రం వద్ద శనివారం రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ నీటిలో కలిపి పిచికారీ చేస్తే తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సూర్య ప్రకాష్ రెడ్డి, ఇఫ్కో సేల్స్ మేనేజర్ మణి చంద్ర, రైతు సేవ కేంద్రం సిబ్బంది కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో వ్యవసాయ శాఖ తరపున రైతులకు బయో ఫెర్టిలైజర్స్, నానో యూరియా, నానో డిఎపి మీద శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ అధికారి షణ్ముగం మాట్లాడుతూ నానో ప్లస్ యూరియా 20% గాడతతో రైతులకు సరఫరా చేస్తున్నామన్నారు. అర్ధ లీటరు నానో ప్లస్ యూరియాను వాడినట్లయితే ఒక బస్తా యూరియా వాడకంతో సమానమని తెలియజేశారు. ఈ అర్ధ లీటర్ నానో ప్లస్ యూరియా 250 రూపాయలన్నారు. నానో డీఏపీ కూడా అర్ధ లీటర్ 250 రూపాయలకు లభిస్తుందని తెలియజేశారు. బయో ఫెర్టిలైజర్ అయినా పాస్ఫో సొల్యూబుల్ బ్యాక్టీరియా వాడడం ద్వారా భూమిలో అందుబాటులోకి రాని భాశ్వరంను పంటలకు అందుబాటులో తీసుకుని రావచ్చు అనారు. పొటాషియం రిలీజింగ్ బ్యాక్టీరియా ప్రోడక్ట్‌ను వాడటం ద్వారా భూమిలో నిల్వ ఉన్న పొటాషియంను మొక్కలకు అందుబాటులోకి తీసుకొని రావచ్చని రైతులకు తెలియజేశారు. అనంతరం వీటిని వాడిన రైతులు అభిప్రాయాలు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారి రేవతి, ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు, గ్రోమోర్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రజాశక్తి - వెంకటగిరి : వెంకటగిరి మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బయో ఫెర్టిలైజర్స్, నానోయూరియా, నానో డి.ఎ.పిల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు నానో యూరియా, నానో డి.ఎ.పి, బయో ఫెర్టిలైజర్ ప్రాధాన్యతను స్థానిక మండల వ్యవసాయాధికారిణి పి.సుజాత వివరించారు. వ్యవసాయాధికారిణి ప్రవీణ నానో యూరియా అవశ్యకతను, ఉపయోగాలను వివరించారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నానో ఎరువు వాడకంతో వాతావరణం, భూమి కాలుష్యం తగ్గుతుందని, పుత్తూరు డివిజన్ వ్యవసాయ ఉపసంచాలకులు లక్ష్మీదేవి తెలిపారు. పుత్తూరు మండలం, రామసముద్రం మండల రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులందరికీ నానో ఎరువు, జీవన ఎరువుల వాడకాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కోదండయ్య, ఏడిఏ లక్ష్మీదేవి, గ్రామ సర్పంచి కుమారస్వామి పాల్గొన్నారు. వారు రైతులకు నానో ఎరువుల వాడకంతో ఉపయోగాలను వివరించారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : నానో యూరియా, డిఎపి, జీవన ఎరువులు వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం రైతు సేవా కేంద్రం, తనపల్లిలో నిర్వహించారు. రైతులు పండించే పంటలలో రసాయన ఎరువులు వాడకం తగ్గించి, నానో ఎరువులైన నానో యూరియా, డిఎపి, జీవన ఎరువులు అయిన ఫాస్ఫేట్ ను కరిగించే ఫాస్ఫేట్ బ్యాక్టీరియా , పొటాషియంను కరిగించే పొటాషియం బ్యాక్టీరియా మొదలగు వాటిని వాడి భూసారాన్ని కాపాడుకోవాలని, సేంద్రియ ఎరువులు , పచ్చిరొట్ట పంటలు వేసుకోవలెనని మండల వ్యవసాయ అధికారి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఏర్పేడు: జీవన ఎరువుల వాడకాన్ని రైతులు ప్రోత్సహిస్తే నాణ్యమైన అధిక దిగుబడి పొందగలరని, రసాయన ఎరువులు వాడటం వలన భూసారం దెబ్బ తినడంతో పాటు, అధిక పెట్టుబడి అవుతుందని ఏర్పేడు వ్యవసాయాధికారిని బి.సాగరిక పేర్కొన్నారు. శనివారం ఎండి పుత్తూరులో నిర్వహించిన కార్యక్రమంలో యూరియా, నానో డిఏపి, జీవన ఎరువుల పై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): రైతన్నలు ఆధునిక సాంకేతికతతో తయారుచేసిన నానో యూరియా, డిఏపిలను వినియోగించటం ఎంతో ఉత్తమమని చంద్రగిరి మండల వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్ పేర్కొన్నారు. స్వర్ణ నారావారిపల్లి లో భాగంగా బి కొంగర వారి పల్లిలో నానో యూరియా, డీఏపీల వాడకంపై మండల వ్యవసాయ అధికారి శనివారం రైతన్నలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.